# తింటే గారెలే తినాలి

తింటే గారెలే తినాలి!

అవునయ్యా! తింటే గారెలే తినాలి. కానీ గారెలు దొరకని చోట, గారెలంటే ఏమీ తెలియని చోట, మరేం తింటారు? చూద్దాం ఏం తింటారో.

ఏ దేశంలో కానీ, ఏ సంస్కృతిలో కానీ, ఆహారం అనేది జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ప్రతిచోటా రకరకాల ఆహార పదార్థాలు. ఒకే ముడిపదార్థంతో ఎన్నో రకరకాల వంటలు. ఇన్ని వేల వంటకాల్ని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. కాకపోతే ఒకటి మాత్రం నిజం. ఆ ప్రదేశంలో ఎక్కువగా ఏం లభిస్తుందో, ఎక్కువ ఆహార పదార్థాలు దానితోనే/వాటితోనే తయారవుతాయి. ఉదాహరణకి దక్షిణ భారతంలో బియ్యం ఎక్కువ పండుతుంది అందుకనే మనకి అన్నిరకాల అన్నాలు. కూర, పచ్చడి, పులుసు, మజ్జిగలో అన్నం, అదికాక పులిహోర, దధ్యోజనం, నిమ్మకాయ అన్నం, అన్నం పరమాన్నం ఇలా ఎన్నో రకాల అన్నాలు అదీకాక బియ్యప్పిండితో రకరకాల వంటలు, పిండివంటలు. అలాగే జపాన్, చైనా, కొరియాలలో సముద్రంలో దొరికే అన్నిటినీ తింటారు. యూరప్‌లో పాలు, పాల పదార్థాలూ చాల ఎక్కువ.

కొన్నిదేశాల్లో తినని, తినకూడని పదార్థాలు, మిగతా కొన్ని దేశాల్లో ఎక్కువగా తింటారు. ఇండియాలో ఆవు మనకి అమ్మతో సమానం. పూజనీయం. అమెరికాలో అదొక ప్రథమ వంటకం. అలాగే అమెరికాలోనూ, యూరప్‌లోనూ కుక్కల్నీ, పిల్లుల్నీ పెంచుకుని, స్వంత పిల్లల్లా చూసుకుంటారు. థాయ్‌లేండ్‌లోనూ, వియత్నాంలోనూ అవి గొప్ప వంటకాలు. అమెరికాలో తినే పందిమాంసం, పాకిస్థాన్‌లోనూ, మరి ఇతర ముస్లిం దేశాల్లోనూ మతపరంగా తినరు.

మనకి కొత్త సంవత్సరం రాగానే తీపి తినటం అలవాటు. అప్పుడు తీపి తింటే ఆ సంవత్సరమంతా తియ్యగా వుంటుందని మన ఉద్దేశ్యం. అమెరికాలో టెక్సాస్‌లాటి దక్షిణరాష్ట్రాల్లో ఓ సామెత వుంది. కొత్త సంవత్సరం రోజున తక్కువ తిను, మిగతా సంవత్సరం పొడుగునా ఎక్కువ తిను అని. అందుకే ఇక్కడ కొత్త సంవత్సరం రోజున పందిమాంసం (కొంతమందికి యాక్కీ- మరి కొంతమందికి యమ్మీ), మొక్క జొన్నలతో చేసిన బ్రెడ్, నల్ల కళ్ళ బఠానీ గింజలు (బ్లాక్ ఐడ్ పీస్), ఆకుకూరలూ తింటారు. ముఖ్యంగా చివరి రెండూ, ఆ సంవత్సరం వాళ్ళకి అదృష్టాన్ని తెచ్చిపెడతాయని నమ్మకం.

స్పెయిన్‌లో వంద సంవత్సరాల క్రితం ద్రాక్షపళ్ళు విపరీతంగా పండి, ఆ దేశ ఆర్థిక పరిస్థితినే మార్చేసిందిట అప్పటినించీ కొత్తసంవత్సరం రాగానే అర్ధ

రాత్రి పన్నెండు గంటలకి గడియారం కొట్టే ప్రతిగంటకీ ఒకటి చొప్పున పన్నెండు ద్రాక్షపళ్ళు తినటం ఒక ఆనవాయితీ.

గ్రీక్ దేశంలో గమ్మత్తైన నమ్మకం వుంది. బ్రెడ్‌లో ఒక నాణాన్ని వుంచి తయారుచేస్తారు. కొత్త సంవత్సరం రోజున అది తినేటప్పుడు ఆ నాణెం ఎవరి నోటికి తగులుతుందో వాళ్ళు ధనవంతులవుతారని! మరి పొరపాటున మింగేస్తే ఆ సంవత్సరం ఏమవుతుందో!

జపాన్‌లో కొత్త సంవత్సరం రోజున వంటలు వండేవాళ్ళకి శెలవు ఇవ్వాలని ఒక ఆచారం. అందుకని మూడు రోజుల ముందుగానే వంటలు పూర్తిచేసుకుని సిద్ధంగావుంటారు. "సోబా నూడుల్స్" చాల పొడుగ్గా వుంటాయి. అవి ఎక్కడా తెగిపోకుండా, నోట్లోకి ఒక్కసారిగా ఎవరు పీల్చేసుకుంటారో వాళ్ళకి అదృష్టం వస్తుందని ఒక నమ్మకం. ఇవి కొత్త సంవత్సరం ఆహార నమ్మకాలయితే, నేను చూసిన కొన్ని విశేషాలు చెప్పాలని వుంది.

చైనాలోని షాంగ్‌హాయ్‌లో నేనూ, ఛార్లీ, ఎడ్, చైనీస్ మిత్రుడు వాంగ్‌తో కలిసి ఒక రాత్రి భోజనానికి వెళ్ళాం. అదొక స్పెషాలిటీ రెస్టారెంట్. ముఖద్వారం దగ్గరే, రంగురంగుల అందమైన చైనీస్ డ్రస్సులు వేసుకున్న అరడజను అమ్మాయిలు, వంగి నమస్కారం చేసి ఆహ్వానించారు. అక్కడ ఒక పక్కగా గోడకి ఆనుకుని, మన సేఫ్టీ డిపాజిట్ బాక్సులాగా తలుపులతో సహా ఎన్నో చిన్నచిన్న అలమరలు వున్నాయి. నేను మాంసాహారం అసలు తినకపోయినా, కుతూహలం కొద్దీ అక్కడికి వెళ్ళాను. మా వెయిటర్ ఒక్కొక్క డ్రాయరూ లాగి, వాటిల్లో కదులుతున్న పాములని చూపిస్తున్నాడు. నేను కొంచెం దూరంగానే నుంచున్నాను. వాంగ్, ఎడ్ చెరొక పాముని ఎంచుకున్నారు. ఛార్లీ నా పక్కనే జేరి "అమ్మో నాకొద్దు" అన్నాడు.

"బాగుంటుంది. తిని చూడు" అన్నాడు వాంగ్.

"నేనుకూడా మొదటిసారిగానే తింటున్నాను కదా. నువ్వూ ట్రై చేయి" అన్నాడు ఎడ్. ఛార్లీ వద్దని నా చేయి పట్టుకుని, నాతోపాటే వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

వెయిటర్ ఆ రెండు పాముల్నీ తీసుకువచ్చాడు. వాటిని పొడుగ్గా కోసి, వాటి రక్తాన్ని అక్కడ వున్న వైన్ గ్లాసుల్లో నింపాడు.

వాంగ్ "మనకోసం" అని టోస్ట్ చేశాడు. అతనూ ఎడ్ మెల్లగా ఆ గ్లాసుల్లోని "హెమోగ్లోబిన్ రసాన్ని" ఆస్వాదించారు. ఎడ్ ముఖం చూస్తుంటే నాకు జాలి వేసింది ఛార్లీ, నేనూ రెడ్ వైన్ తీసుకున్నాం. నేను వెజిటబుల్ ఫ్రైడ్ రైస్ ఆర్డర్ చేశాను. షెషువాంగ్ స్టైయిల్ అని చెప్పాను. అంటే ఆ వెజిటబుల్ రైస్ మీద ఎర్రటి మిరపకాయలు అందంగా అలంకరిస్తారు. ఛార్లీ ఇంకేదో ఆర్డర్ చేశాడు. వాంగ్‌కీ, ఎడ్‌కీ ఆ పాములతోనే వండిన పదార్థాలు తెచ్చి ఇచ్చాడు.

"కొంచెం రుచి చూస్తావా" అని ఛార్లీని అడిగాడు వాంగ్ నవ్వుతూ.

అడ్డంగా తలవూపాడు ఛార్లీ.

ఇలాగే ఇంకోసారి జపాన్లో బిజినెస్ డిన్నర్‌కి వెళ్ళాం. కార్పెట్ మీద పరిచిన చాపల మీద కూర్చుని, మన టిపాయ్ లాటి బల్లల మీద వడ్డిస్తున్నారు. చెప్పులు బయటే వదిలేసి అందరం వెళ్ళి బాసింపెట్లు వేసుకుని కూర్చున్నాం. నాకు ఒక పక్కన ట్రేసీ, ఇంకో పక్కన జో కూర్చున్నారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాం. జపాన్లో ఆచారం ఏమిటంటే ఎవరికి వాళ్ళు వడ్డించుకోకూడదు. మనం పక్కవాళ్ళకి ఇవ్వాలి. వాళ్ళు మనకి ఇస్తారన్నమాట. ట్రేసీకి నా ఆహార నియమాలు తెలుసు కనుక నాకేమీ ఇబ్బంది రాలేదు. బల్ల మీద వుడకేసి ప్లేట్లో పెట్టిన ఒక పెద్ద చేప కళ్ళు చూస్తుంటే, అది నన్నే చూస్తున్నట్టనిపించింది. కరుణశ్రీ గారి పుష్పవిలాపం గుర్తుకొచ్చింది.

ట్రేసీ ప్లేటుకి పక్కనే పెట్టిన చిన్న గిన్నెలో వుంది ఒక చిన్న ఆక్టోపస్.

"నేనెప్పుడూ ఆక్టోపస్ తినలేదు. ఇదే మొదటిసారి" అంటూ తన ఫోర్క్‌తో దాన్ని తీసుకోబోయింది ట్రేసీ. అది ఒక్కసారిగా ఆ గిన్నెలో కదలటం మొదలు పెట్టింది. అది కదులుతుందని అనుకోలేదేమో, భయపడి పెద్దగా అరిచి, ఒక్కసారిగా ఎగిరిపడింది ట్రేసీ. బల్ల మీద వున్న సాకీ (బియ్యంతో చేసే ఒక రకమైన జాపనీస్ వైన్), మిగతా పదార్థాలూ అన్నీ నా కోటు మీదా, ప్యాంట్ మీదా, జో చొక్కా మీదా టై మీదా పడ్డాయి. ఇక ట్రేసీ బట్టలూ, చేతులూ ముఖం తడిసిపోయాయి "అది కదులుతుందనుకోలేదు. సారీ" అంది నెమ్మదిగా.

వారం రోజులు ఆ అల్పాహారాలు తిని బాధ పడ్డామేమో, మర్నాడందరితో పాటూ బిజినెస్ డిన్నర్‌కి వెళ్ళకుండా నేనూ, ట్రేసీ, జో, మైక్ రోడ్డు మీద పడ్డాం. "మెక్‌డొనాల్డ్స్ కనిపిస్తుందేమో చూడు" అని నాతో చెప్పి అన్ని పక్కలా చూస్తూ నడుస్తున్నది ట్రేసీ. నడవగా నడవగా అక్కడ ఒక మెక్‌డొనాల్డ్స్. నిన్న రాత్రికన్నా ఎక్కువ ఎత్తుకు ఎగిరింది ట్రేసీ ఆనందంతో. ఆమెకన్నా ఎత్తుకు ఎగిరాను నేను, దాని పక్కనే వున్న నియాన్ బొమ్మని చూసి. అక్షరాలు జాపనీస్‌లో వున్నా ఒక బొట్టు పెట్టుకున్న అమ్మాయి బొమ్మ వుంది ఆ రెస్టారెంట్ బోర్డు మీద. నేనూ నాతోపాటూ మైక్ అక్కడికి వెళ్ళాం, ట్రేసీ జో మెక్‌డొనాల్డ్స్‌కి వెళ్ళారు. ఆ ఇండియన్ రెస్టారెంట్లో ఒక జపనీస్ ఆవిడ, వేడివేడిగా చపాతీలు, బంగాళా దుంప కూర చేసి పెట్టింది. అప్పడాలతో అవి ఆబగా తిని అమ్మయ్య అనుకున్నాను. కొన్నాళ్ళు ఆవిడ భర్త ఉద్యోగం చేస్తుంటే కలకత్తాలో వున్నాననీ, అక్కడే ఇండియన్ వంటలు నేర్చుకున్నాననీ చెప్పింది బెంగాలీ కలిపిన జాపనీస్‌లో.

ఆ ట్రిప్‌నించీ ఆస్టిన్‌లో ఇంటికి రాగానే, "నీ ప్రయాణం బాగా జరిగిందా? నీకిష్టమని గారెలు చేశాను. విత్ ఉల్లిపాయ సాంబార్. కొన్ని పెరుగులో కూడా వేశానులే నీకిష్టమని" అంది. ప్రేమగా చూశాను శ్రీమతి వేపు.

"ఇవాళ. భోగి పండగ కదా. అందుకని" అంది నవ్వి.

సాంబారులో గారెలు ముంచుకుని తింటూ, "తింటే గారెలే తినాలి" అనుకున్నాను ఇంకొకసారి

* * *